సాక్షి
రంగారెడ్డి
ఆదివారం । 15 । జనవరి । 2023

మంత్రికి వినతి



చిక్కడపల్లి: నూతనంగా ఎన్నికైన తెలంగాణ దేవాదాయ శాఖ కార్యానిర్వాహణాధికారుల సంఘ సభ్యులు శనివారం బూర్గుల రామకృష్ణరావు భవనంలో ఆ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. సంఘం అధ్యక్షుడు నరేందర్, వ్యవస్థాపక అధ్యక్షుడు అంజనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



షాబాద్: నాగర్‌గూడలో ఇళ్ల ముందు ముగ్గులు వేస్తున్న మహిళలు



తుక్కుగూడ : భోగి మంటలు



షాబాద్: గంగిరెద్దు ఆటలు



మీర్‌పేట: గాలి పటాలతో చిన్నారులు

పల్లెకు పండుగ కళ

ఇళ్ల ముందు ఇంద్రధనస్సులను తలపించే రంగవల్లులు.. మధ్యలో నవధాన్యాలతో పేర్చిన గొబ్బెమ్మలు.. భోగి మంటలు.. చిన్నారులకు భోగిపళ్లు.. సంప్రదాయ వస్త్రధారణ.. గంగిరెద్దుల ఆటలు.. ఘుమఘుమలాడే పిండివంటకాలు.. ఆకాశంలో గాలిపటాల సవ్వడి.. ఉత్సాహంగా క్రీడాపోటీలు.. 'సంక్రాంతి వచ్చిందే తుమ్మెద.. సరదాలు తెచ్చిందే తుమ్మెద' అంటూ పాటల హోరు.. మొత్తంగా పల్లెకు పండుగ కళ వచ్చింది. ఊరూ.. వాడా.. ఎక్కడ చూసినా సందడి వాతావరణం నెలకొంది. కొడుకులు, కోడళ్లు.. కూతుళ్లు, అల్లుళ్లు.. మనవలు.. మనవరాళ్లతో ఏ ఇంట్లో చూసినా కోలాహలమే. శనివారం జిల్లావాసులు భోగి పండుగను ఘనంగా జరుపుకొన్నారు. ఆదివారం సంక్రాంతి సంబరాలకు సిద్ధమయ్యారు.



కేశంపేట: క్రికెట్ పోటీలు



తలకొండపల్లి: చంద్రధనలో గాలిపటాలతో సందడి చేస్తున్న చిన్నారులు, పెద్దలు

న్యూస్‌రీల్

అనుమానాస్పద వ్యక్తులపై సమాచారం అందించండి

షాద్‌నగర్ ఏసీపీ కుషాల్కర్



తాళం వేసి ఉన్న ఇంటిని పరిశీలిస్తున్న ఏసీపీ కుషాల్కర్ తదితరులు

షాద్‌నగర్: అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని షాద్‌నగర్ ఏసీపీ కుషాల్కర్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని భగత్‌సింగ్, టీచర్స్ కాలనీల్లో శనివారం పట్టణ సీఐ నవీన్‌కుమార్, ఎస్‌ఐ వెంకటేశ్వర్లుతో కలిసి పర్యటించారు. సంక్రాంతి సందర్భంగా తాళం వేసి వెళ్లిన ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. పండుగ సందర్భంగా చాలా మంది ఇళ్లకు తాళాలు వేసి స్వగ్రామాలు వెళ్తుంటారని, ఇదే అదనుగా దొంగలు చోరీలకు పాల్పడుతుంటారని అన్నారు. వెళ్లేటప్పుడు మెయిన్ డోర్‌కు సెంటర్ లాకింగ్ వేయాలని, విధిగా డోర్‌లకు కర్టెన్లు ఏర్పాటు చేయాలని, విలువైన బంగారు ఆభరణాలు, వస్తువులు, నగదును ఇళ్లలో ఉంచుకోవద్దని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఊళ్లకు వెళ్లే ముందు పోలీసులకు సమాచారం అందించాలన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు, ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతుంటే వెంటనే 100కు డయల్ చేయాలని, లేదంటే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.కార్యక్రమంలో కాలనీవాసులు విప్ప రి నరేష్, బీరయ్య తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును పకడ్బందీగా నిర్వహించాలి



గ్రంథాలయ భవనాన్ని పరిశీలిస్తున్న జిల్లా మాస్‌మీడియా అధికారి నరహరి

కేశంపేట: కంటి వెలుగును పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా మాస్ మీడియా అధికారి పాలాది నరహరి అన్నారు. మండల పరిధిలో కార్యక్రమం నిర్వహణ కోసం జరుగుతున్న ఏర్పాట్లను శనివారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని గ్రంథాలయ భవనంతో పాటు సంగెం గ్రామంలోని పంచాయతీ భవనాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజలకు ఎక్కడా అసౌకర్యం కలగొద్దని, వంద శాతం విజయవంతం చేసేలా క్షేత్రస్థాయిలో సిబ్బంది కృషి చేయాలని అన్నారు. ఈ మేరకు సిబ్బందికి తగిన సూచనాలు చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు తలసాని వెంకట్‌రెడ్డి, రేణుక జంగయ్య, ఎంపీహెచ్‌ఈఓ ఆంజనేయులు, శేఖర్, పుష్ప, సుందరి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూములు అన్యాక్రాంతం!


- మొయినాబాద్‌లో యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహాస్వామి భూములు కబ్జా
- తొర్రూర్, మామిడిపల్లిలో రంగనాథస్వామి భూములు స్వాహా
- సాతంరాయిలో రాములోరి భూములు మాయం
- కళ్లముందే కరిగిపోతున్నా పట్టించుకోని పాలకమండళ్లు

యాదగిరిగుట్ట లక్ష్మీ నర్సింహాస్వామి పేరున మొయినాబాద్ అజీజ్‌నగర్ రెవెన్యూ సర్వే నంబర్ 67/ఇ/1లో 1.04 ఎకరాల భూమి ఉండగా, సర్వే నంబర్ 67/ఇ/2లో 33 గుంటల భూమి ఉంది. 2009లో కనకమామిడికి చెందిన షాపురం బాల్‌రెడ్డి ఈ భూమిని దేవాలయానికి రాసిచ్చారు. ధరణిలోనూ దేవాలయం పేరున ఉంది. రూ.15 కోట్ల విలువ చేసే ఈ భూములపై కబ్జాదా రుల కళ్లు పడ్డాయి. ఆక్రమణకు గురైనట్లు గుర్తించిన స్థానికులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.

తొర్రూరులోని సర్వే నంబర్లు 113,115,366,367లలో రంగనాథస్వామి ఆలయానికి 8 ఎకరాలకుపైగా ఉన్నాయి. కొంతమంది వీటిని కబ్జా చేశారు. కాపాడాల్సిందిగా ఆలయ కమిటీ మాజీ డైరెక్టర్ మంగమ్మ ఇటీవల మానవహక్కుల కమిషన్‌లో ఫిర్యాదు చేశారు.

సాతంరాయిలోని కోదండరామాలయానికి శంషాబాద్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 660, 665,668లో 35.5 ఎకరాలు, గగన్‌పహాడ్ రెవెన్యూ సర్వే నంబర్ 241,242,243, 244,245, 246,252లో 35.34 ఎకరాలు ఉన్నాయి. మొత్తం 70.84 ఎకరాలు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం ఏడు ఎకరాలే మిగిలాయి. రూ.500 కోట్ల విలువ చేసే 63 ఎకరాల భూమి ఇప్పటికే కబ్జాకు గురైంది.

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఆలయాలకు ఉన్న విలువైన భూములు అ న్యాక్రాంతం అవుతున్నాయి. పట్టా భూముల పక్కనే ఉండటం, రక్షణ లేకపోవడంతో కబ్జాకు గురవుతున్నాయి. విలువైన భూములకు కాపాడాల్సిన పాలకమండళ్లు పట్టించుకోవడం



తొర్రూరులోని రంగనాథ స్వామి ఆలయం

లేదు. కొంత మంది సభ్యులే అన్యాక్రాంతానికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. జీహెచ్ఎంసీ పరిధిలో 1,736 దేవాలయాలు ఉన్నట్లు అంచనా. వీటికి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో వందలాది ఎకరాలు ఉన్నాయి. వీటిపై ఆక్రమణదారులు కన్నేశారు. ఒక్కటొక్కటిగా హారతికర్పూరంలా కరిగిపోతున్నాయి. కొంతమంది భక్తులు, అర్చకులు, పాలకమండళ్లు గుర్తించి సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం ఉండడం లేదు.

- యాచారం మండలం నందివనపర్తిలోని ఓంకారేశ్వరాలయానికి 1,450 ఎకరాల భూములు ఉండగా, వీటిలో ఇప్పటికే చాలా వరకు కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లాయి. మిగిలిన భూమి 1,200 మంది కౌలురైతుల చేతుల్లోకి వెళ్లిపోయింది.
- కొందుర్గులోని పెండాల లక్ష్మీనర్సింహాస్వామి దేవాలయానికి 360 ఎకరాల భూములు ఉండగా, ప్రస్తుతం 312 ఎకరాలు మిగిలాయి. పది ఎకరాల్లో పక్క రాష్ట్రాల నుంచి వలస వచ్చిన వారు ఆక్రమించారు. ఆక్రమణలపై 2018లో దేవాదాయశాఖ అధికారులు ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు.
- బాలాపూర్ మండలం మామిడిపల్లి శివారులో చారిత్రక రంగనాథస్వామి ఆలయం ఉంది. దీనికి సర్వే నంబర్ 99/2లో 15.23 ఎకరాల భూమి ఉంది. ఎకరంలో కోవెల కొలువై ఉండగా, మిగిలిన భూమంతా ఖాళీగా ఉంది. దీనిపై రియల్టర్ల కన్నుపడింది. దీనికి సమీపంలోని బాలాజీ వేంకటేశ్వరస్వామి దేవాలయానికి సంబంధించిన 33 ఎకరాల భూమిని సైతం కబ్జా చేసేందుకు యత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. దేవతలగుట్ట భూములు కూడా పూర్తిగా కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లిపోయాయి.

కలెక్టర్‌కు ఫిర్యాదు

బాటసింగారం పరిధిలో 110 ఎకరాల్లో పంచాయతీ లే అవుట్ చేశారు. ఇందులో 11 ఎకరాలు ఆలయానికి, ఇతర ప్రజావసరాలకు కేటాయించారు. ఈ భూమిని ప్రస్తుతం కొంత మంది ఆక్రమించేందుకు యత్నిస్తున్నారు. కాపాడాలని ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం.

– విష్ణుగౌడ్, అబ్దుల్లాపూర్‌మెట్

హైకోర్టులో కేసు వేశాం

షాబాద్ సీతారామచంద్రస్వామి ఆలయానికి ఉన్న 1,100 ఎకరాల భూమిని ప్రభుత్వం పరిశ్రమల పేరుతో స్వాధీనం చేసుకుంది.600 ఏళ్ల క్రితం దాతలు దేవుడికి రాసిచ్చిన భూములను ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టింది. దీనిపై హైకోర్టులో ప్రజాప్రయోజనాల వాజ్యం వేశాం. న్యాయం జరిగేదాకా పోరాడుతాం.

– పేరాల శేఖర్‌జీ, బీజేపీ నాయకుడు

కల్యాణం.. వైభోగం

కనులపండువగా గోదాదేవి కల్యాణం



కల్యాణోత్సవంలో మంగళసూత్రం చూపిస్తున్న అర్చకులు

మొయినాబాద్: పూల పందిరి.. పచ్చని తోరణాలు.. మంగళవాయిద్యాలు.. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య చిలుకూరు బాలాజీ సన్నిధిలో 'గోదా కల్యాణం' వైభవంగా జరిగింది. చిలుకూరులో ధనుర్మాసం చివరిరోజైన భోగి పండుగ రోజు గోదా కళ్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. శనివారం అర్చకుడు పరావస్తు రంగాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితుల చేతులమీదుగా ఆలయ ప్రాంగణంలోని అద్దాలమహల్‌లో అంగరంగ వైభవంగా కల్యాణం జరిపించారు. మొదట ఆలయంలోని వేంకటేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవి ఉత్సవ మూర్తులను ఊరేగిస్తూ అద్దాలమేడలోకి తీసుకొచ్చారు. అక్కడ ఏర్పాటుచేసిన మండపంలో స్వామి, అమ్మవార్ల సమక్షంలో కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. అర్చకుడు రంగరాజన్ గోదా కల్యాణం విశిష్టతను భక్తుల కు వివరించారు. ఆలయానికి వచ్చిన భక్తులు మహాద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని శివాలయంలో పూజలు నిర్వహించారు. ఆలయ మేనేజింగ్ కమిటీ కన్వీనర్ గోపాలకృష్ణ, అర్చకులు రంగరాజన్, నరసింహ, కన్నయ్య, కిట్టు స్వామి, మురళిస్వామి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

కిటకిటలాడిన నుమాయిష్

గన్‌ఫౌండ్రీ: నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో జరుగుతున్న 82వ అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్) సందర్శకులతో కిటకిటలాడుతోంది. సంక్రాంతి పండుగ సెలవులు కావడంతో శనివారం ఎగ్జిబిషన్‌ను 75 వేలకు పైగా సందర్శకులు సందర్శించినట్లు బుకింగ్ కమిటీ చైర్మన్ హన్మంతు తెలిపారు. ఇప్పటి వరకు ఎగ్జిబిషన్‌ను 4.25 లక్షల మంది సందర్శించారని, ఈ ఏడాది 23 లక్షల మంది సందర్శకులు వస్తారని అంచనా వేస్తున్నట్లు వెల్లడించారు. కాగా ఎగ్జిబిషన్‌కు సందర్శకులు పెద్ద ఎత్తున తరలి రావడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. దీంతో పలు వాహనాలను ట్రాఫిక్ పోలీసులు దారిమళ్లించారు. మరోవైపు జైళ్లశాఖ స్టాల్‌ను ప్రారంభించారు.

జేపీదర్గాను పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దుతాం

- వక్ఫ్‌బోర్డు చైర్మన్ మసిఉల్లాఖాన్

కొత్తూరు: రాష్ట్రవ్యాప్తంగా ప్రసిద్ధి గాంచిన హజ్రత్ జహంగీర్‌పీర్ దర్గాను పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చేస్తామని వక్ఫ్‌బోర్డు చైర్మన్ మసిఉల్లాఖాన్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌తో కలిసి శనివారం ఆయన బాబాకు చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ నెల 19 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే ఉర్సుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు దర్గా అభివృద్ధికి సంబంధించి మాస్టర్‌ప్లాన్ రూపకల్పన తుదిదశలో ఉందన్నారు. ప్లాన్ సిద్ధం అయిన వెంటనే ముఖ్యమంత్రి ఆమోదంతో అభివృద్ధి పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. మాస్టర్‌ప్లాన్ మేరకు అభివృద్ధి పనులు చేపడితే భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేశ్, ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ అజయ్ నాయక్, నాయకులు దేవేందర్‌యాదవ్, విశ్వం, గోపాల్‌నాయక్, తస్లీం, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.



బాబాకు చాదర్ సమర్పించడానికి వెళ్తున్న వక్ఫ్‌బోర్డు చైర్మన్, ఎమ్మెల్యే

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

- అధ్యయనానికి విద్యా కమిషన్‌ను నియమించాలి
- జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలి
- ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి
- టీఎస్‌యూటీఎఫ్ నేతల డిమాండ్
- రెండోరోజు కొనసాగిన 5వ రాష్ట్ర మహాసభలు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

తుర్కయంజాల్: పాఠశాల విద్యలో సమస్యలను అధ్యయనం చేసేందుకు వెంటనే విద్యా కమిషన్‌ను నియమించాలని టీఎస్‌యూటీఎఫ్ డిమాండ్ చేసింది. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులను ప్రారంభించాలని కోరింది. సంఘం 5వ రాష్ట్ర మహాసభలు శనివారం రెండోరోజు తుర్కయంజాల్‌లోని బీఎంఆర్ సార్థ కన్వెన్షన్ హాల్‌లో కొనసాగాయి. ఈ సందర్భంగా విద్యారంగం, ఉపాధ్యాయుల సంక్షేమంతో పాటు పలు సమస్యలపై 23 తీర్మానాలను ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదించారు. రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జంగయ్య, రవి మాట్లాడుతూ.. జాతీయ విద్యా విధానం–2020ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మన ఊరు –మనబడి కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించినా ఇప్పటికీ నిధులు కేటాయించకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదన్నారు. పాఠశాలల్లో పరిశుభ్రతను పంచాయతీలు, మున్సిపాలిటీలకు అప్పగించి చేతులు దులుపుకొన్నారని విమర్శించారు. వెంటనే స్వీపర్, అటెండర్, వాచ్‌మన్, క్లర్క్స్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టిన ప్రభుత్వం అదనంగా ఉపాధ్యాయులను నియమించడం మరిచిందని, దీంతో పనిచేసే వారిపైనే అదనపు భారం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రెగ్యులర్ డీఈఓ, డిప్యూటీ డీఈఓ, ఎంఈఓ పోస్టులను భర్తీ చేసి విద్య వ్యవస్థను పర్యవేక్షించాలన్నారు. ప్రధానోపాధ్యాయుల ప్రమోషన్లతో పాటు, ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని వారు కోరారు. సీపీఎస్ రద్దును జాతీయ స్థాయిలో తీసుకెళ్లేందుకు సీఎం కేసీఆర్ కృషి చేయాలని, రాష్ట్రంలో వెంటనే దీన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు ఓటు హక్కు కల్పించాలన్నారు. యూనియన్ బలపర్చిన మాణిక్ రెడ్డి గెలుపు కోసం అందరం కలిసికట్టుగా పనిచేస్తామని తెలిపారు. రానున్న రోజుల్లో విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గాలయ్య తదితరులు పాల్గొన్నారు.

సిటీ ఖాళీ!

- సంక్రాంతికి సొంతూరికి తరలిన నగరవాసులు
- రెండ్రోజుల్లో టోల్ గేటు దాటిన రెండున్నర లక్షలకు పైగా వాహనాలు
- అత్యధికంగా 1.24 లక్షల వాహనాలు విజయవాడ హైవేలో పయనం
- రాత్రి 10 నుంచి ఒంటిగంట మధ్య ప్రయాణాలే ఎక్కువ



సాక్షి, సిటీబ్యూరో: భాగ్యనగరం ఖాళీ అయింది. సంక్రాంతి పండుగ నేపథ్యంలో నగరవాసులు సొంతూర్లకు వెళ్లిపోయారు. వ్యక్తిగత వాహనాలు, బస్సులు, ప్రైవేట్ వాహనాలలో పయనమయ్యారు. దీంతో ఔటర్, జాతీయ రహదారులు వాహనాలతో కిక్కిరిసిపోయాయి. ప్రధానంగా విజయవాడ, బెంగళూరు, వరంగల్ హైవేలలోని టోల్‌గేట్ల వద్ద వాహనాలు బారులు తీరాయి. శనివారం భోగి కావటంతో గురు, శుక్ర వారాల్లో నగరవాసులు పెద్ద సంఖ్యలో సొంతూర్లకు వెళ్లారు. 12, 13 తేదీలలో రెండున్నర లక్షల పైనే వాహనాలు ఆయా హైవేలలోని టోల్‌గేట్లను దాటాయని ట్రాఫిక్ పోలీసులు అంచనా వేశారు. 1,49,403 వాహనాలు విజయవాడ హైవేలోని పంతంగి, వరంగల్ హైవేలోని బీబీనగర్ టోల్‌ప్లాజాలను దాటివెళ్లినట్లు రాచకొండ ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ఇందులో 1,14,249 వాహనాలు కార్లే కావటం గమనార్హం. ఈ రెండు రోజులలో 1,24,172 వాహనాలు విజయవాడ హైవేలోనే ప్రయాణించాయని పోలీసులు తెలిపారు. అలాగే వరంగల్ వైపు నుంచి హైదరాబాద్‌కు 13,334 వాహనాలు వచ్చాయి. రాత్రి 10 గంటల నుంచి అర్ధరాత్రి 1 గంటల మధ్య నగరవాసులు ఎక్కువగా వాహనాలలో ప్రయాణించారు.

పంతంగి టోల్‌గేట్	
వాహనం రకం	సంఖ్య
కార్లు	96,405
ఆర్టీసీ బస్సులు	3.151
ప్రైవేట్ బస్సులు	9.819
ఇతరత్రా వాహనాలు	14.797
బీబీనగర్ టోల్‌గేట్:	
కార్లు	17,844
బస్సులు	872

ప్రత్యేక బృందాలతో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ

హైవేలలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. ఆర్టీసీ, జీఎంఆర్ టోల్ నిర్వహణ బృందాలతో పని చేస్తున్నాం. మెయిన్ రోడ్లలో వెళ్తున్న వారు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం.

– డి.శ్రీనివాస్, డీసీపీ, రాచకొండ ట్రాఫిక్

దొంగల అరెస్ట్, రిమాండ్

చేవెళ్ల: స్థానిక మీసేవా కేంద్రంలో చోరీకి పాల్పడిన దొంగలను పోలీసులు అరెస్ట్ చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ ప్రదీప్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఉన్న మీసేవా కేంద్రంలో ఈనెల 12న అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. కౌంటర్‌లో ఉన్న రూ.20 వేల నగదును అపహరించారు. మీసేవా కేంద్రం యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. సీసీ పుటేజీల ద్వారా దొంగలను గుర్తించి పట్టుకున్నారు.

చైనా మాంజా విక్రేతలపై కేసులు

ఇబ్రహీంపట్నం రూరల్: సంక్రాంతి పండుగ సందర్భంగా చైనా మాంజా విక్రయిస్తున్న వ్యాపారులపై ఆదిబట్ల పోలీసులు కేసులు నమోదు చేశారు. వారి నుంచి చైనా మాంజాను స్వాధీనం చేసుకున్నారు. సీఐ రవికుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తుర్కయంజాల్‌లో చంద్రశేఖర్, కమ్మగూడ కాలనీలో గొని రాము, రాగన్నగూడలో గంజి వెంకట మల్లికార్జున్ అనే ముగ్గురు వ్యక్తులు నిషేధించిన మాంజాను విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు.

'ముంపు' పేరిట

ముంచేస్తూ..



- మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్‌ల పేరిట మాయా జాలం
- వాహనాలు లేకున్నా.. వర్కర్లు లేకున్నా పనులు?
- జీహెచ్ఎంసీ ఖజానాకు గండి
- కొన్ని చోట్ల 40 శాతానికి పైగా లెస్‌కు.. మరికొన్ని చోట్ల ఒక్క శాతం లోపే
- రూ. 37 కోట్ల పనుల్లో అక్రమాలెన్నో

సాక్షి, సిటీబ్యూరో: పూడికతీత పనుల నుంచి రోడ్ల పనుల దాకా అన్నింటా కుమ్మక్కవుతున్న జీహెచ్ఎంసీ ఇంజినీర్లు, కాంట్రాక్టర్లు వానాకాలంలో ముంపుసమస్యలు తలెత్తకుండా ఏర్పాటు చేసిన మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్స్(ఎంఈటీ)లోనూ అవకతవకలకు పాల్పడ్డారు. ఒకే రకమైన పనికి ఒక్కోచోట ఒక్కోరేటు ఉండగా, కొన్ని చోట్ల ఒక్క శాతం కంటే తక్కువకే కాంట్రాక్టర్లకు కేటాయించగా, కొన్ని చోట్ల 40 శాతానికి మించి లెస్‌కు పనులప్పగించారు. గత సంవత్సరం వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా వెంటనే తోడిపోయడానికి 326 టీమ్స్ ఏర్పాటు చేశారు. వాటిల్లో 160 స్టాటిక్ టీమ్స్ కాగా, మిగతావి మొబైల్ టీమ్స్.

- మొబైల్ టీమ్స్‌లో డీసీఎం, ట్రాక్టర్, టాటా ఏస్, జీప్ వంటి వాహనంతో పాటు నలుగురు కార్మికులుంటారని చెబుతున్నా, చాలా ప్రాంతాల్లో ఇద్దరు లేదా ముగ్గురు కార్మికులనే పనులకు వినియోగించారు. ఉండాల్సిన వాహనాల బదులుగా ఆటోలనుసైతం వినియోగించారు. ఇక కార్మికులకు ఇవ్వాల్సిన రేడియం జాకెట్లు, షూస్, రెయిన్‌కోట్లు, గొడుగులు, టార్చిలు వంటివి మాటలకే పరిమితమయ్యాయి. ఈ టీమ్స్ ఏర్పాటు పేరిట రూ. 37.42 కోట్ల పనులు చేశారు. కొందరు కాంట్రాక్టర్లే ఎక్కువచోట్ల పనులు పొందడం..వాటిల్లో కొన్ని చోట్ల తక్కువలెస్‌కు టెండర్ దక్కించుకోగా, మరికొన్ని చోట్ల చాలా ఎక్కువ లెస్‌కు వేయడం అనుమానాలకు తావిస్తోంది.

రూ. 14 లక్షల పని రూ.6 లక్షలకే ..

- ఒక కాంట్రాక్టు ఏజెన్సీ ఈ టీమ్స్ ఏర్పాటుకు సంబంధించి మలక్‌పేట సర్కిల్‌లో ఒక్కొక్కటి రూ.14.20 లక్షల విలువైన రెండు పనులను దాదాపు రూ. 6.75 లక్షలకే చేసింది. అంటే ఎంత ఎక్కువ లెస్‌కు పనిచేసిందో అంచనా వేసుకోవచ్చు. అలాగే ఖైరతాబాద్ సర్కిల్‌లో ఒక కాంట్రాక్టర్ రూ.17.30 లక్షల విలువైన ఒక పనిని 48.58 శాతం లెస్‌తో ,రూ.17.35 లక్షల విలువైన మరో పనిని 48.99 శాతం లెస్‌తో చేసేశారట.
- అలాగే ఫలక్‌నుమా సర్కిల్‌లో రూ.12.80 లక్షల విలువైన పనిని 48.01 శాతం లెస్‌తో, రూ.12.80 లక్షల విలువైన పనిని 47.99 శాతం లెస్‌తో పూర్తిచేశారు.
- ఇంత ఎక్కువ లెస్‌కు పనులు చేశారంటే, టీమ్‌లు అన్నివేళలా పని చేయకపోవడమైనా ఉండాలి. లేదా ఒకే యూనిట్‌ను(వాహనం,వర్కర్లు) రెండు చోట్లా చూపి ఉండాలి. లేదా వర్కర్లను తగ్గించి ఉండాలి. ఈ ఉదాహరణలు కేవలం మచ్చుకు మాత్రమే. ఇలా అత్యధికంగా 40 శాతం, అంత కంటే ఎక్కువ లెస్‌తో పనులు చేసిన కాంట్రాక్టర్లు ఎందరో ఉన్నారు.

ఒక్క శాతం లోపునే..

- ఇక అత్యల్పంగా ఒక్క శాతం కంటే తక్కువ లెస్‌తోనే పనులు చేసిన వారు సైతం ఉన్నారు.
- హయత్‌నగర్ సర్కిల్‌లో రూ.13 లక్షల విలువైన పనిని చాంద్రాయణగుట్ట సర్కిల్‌లో రూ. 15 లక్షల విలువైన పనిని కేవలం ఒక్కశాతం కంటే తక్కువ లెస్‌కే చేశారు.

రూ. 10 కోట్ల అవినీతి..?

వీటిని చూస్తుంటే కొన్ని సర్కిళ్లలో అధికారులు అంచనా వ్యయం అత్యధికంగా వేసి కాంట్రాక్టర్లతో ఎక్కువ లెస్ వేయించారా? లేక పనులు మేం చూసుకుంటాంలే అని పనులు చేయకున్నా బిల్లులు చెల్లిస్తున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని సర్కిళ్లలో అంచనా వ్యయం రూ.20 లక్షలుంటే కొన్ని సర్కిళ్లలో కోటిరూపాయల వరకుంది. వాహనాలు ఎక్కడైనా ఒకటే. సిబ్బంది సంఖ్యలో తేడా ఉంటే అంచనా వ్యయంలో ఆమేరకు కొంత తేడా ఉండవచ్చుకానీ రెట్టింపు కంటే ఎక్కువగా ఉండటానికి కారణం సంబంధిత ఇంజినీర్లకే తెలియాలి.ఇంజినీర్లు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై జీహెచ్ఎంసీ ఖజానాకు గండి కొట్టడానికి వారి ఇంజినీరింగ్ ప్రతిభాపాటవాలు ప్రదర్శించారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తిలా పాపం తలా పిడికెడులా కొందరు స్థానిక కార్పొరేటర్లకు సైతం వాటాలందిఉంటాయని జీహెచ్ఎంసీ వ్యవహారాలు తెలిసిన వారు చెబుతున్నారు. ఈ ముంపు పరిష్కార పనుల్లో దాదాపు రూ. 10 కోట్ల మేర అవినీతి జరిగిందనే ఆరోపణలున్నాయి.

అక్రమార్కులపై చర్యలు తీసుకుంటాం..

అవకతవకలపై ఫిర్యాదులున్నాయని, విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని సంబంధిత ఉన్నతాధికారి తెలిపారు.

కొందరికే ఎక్కువ పనులు..

- కొందరు కాంట్రాక్టర్లు ఎక్కువ పనులు దక్కించుకోవడం ఇందుకు ఊతమిస్తోంది. ఎల్‌బీనగర్ జోన్‌లోని ఉప్పల్,హయత్‌నగర్ రెండు సర్కిళ్ల పనులు చేసిన ఒక కాంట్రాక్టర్ ఒక చోట 7.25 శాతం లెస్‌తో చేయగా, మరోచోట 29.09 లెస్‌తో చేశారు. అంటే ఒక చోట తగ్గించింది మరోచోట పూడ్చుకున్నారన్న మాట. ఇదే కాంట్రాక్టర్ అల్వాల్, మల్కాజిగిరి సర్కిళ్లలోనూ చేశారు. అక్కడ మాత్రం కేవలం 0.09 శాతం, 0.56 శాతం లెస్‌కు మాత్రమే చేయడం విశేషం.
- అదే జోన్‌లో ఇద్దరు కాంట్రాక్టర్లు హయత్‌నగర్, ఎల్‌బీనగర్ రెండు సర్కిళ్లలోనూ , మరో కాంట్రాక్టర్ ఉప్పల్, సరూర్‌నగర్ రెండు సర్కిళ్లలో పనులు చేశారు. హయత్‌నగర్, ఎల్‌బీనగర్ సర్కిళ్లలో పనులు చేసిన ఒక కాంట్రాక్టరే కూకట్‌పల్లి, అల్వాల్, రాజేంద్రనగర్,బేగంపేట సర్కిళ్లలోనూ పనిచేశారు.
- చందానగర్, శేరిలింగంపల్లి జంట సర్కిళ్లలోని ఆరు పనుల్లో నాలుగింటిని ఒక్క కాంట్రాక్టరే చేశారు. మరో కాంట్రాక్టర్ జూబ్లీహిల్స్‌తో పాటు కార్వాన్,గోషామహల్‌లోనూ పనులు చేశారు.
- గోషామహల్‌లోని కాంట్రాక్టర్ మూడు పనుల్ని 45 శాతం లెస్‌కు చేశారు.
- రాజేంద్రనగర్‌లోని పనులన్నింటినీ రెండు సంస్థలే దక్కించుకున్నాయి.
- ఇలా చెప్పుకుంటూ పోతే మాన్సూన్ ఎమర్జెన్సీటీమ్స్ పేరిట జరిగిన మాయాజాలానికి అంతే లేదు.

పట్టాలు తప్పిన గూడ్స్

- పలు రైళ్ల దారి మళ్లింపు
- ఇబ్బంది పడిన ప్రయాణికులు



చిత్తాపూర్ సమీపంలో పట్టాలు తప్పిన రైలు

అనంతగిరి: కర్ణాటక రాష్ట్రం చిత్తాపూర్ సమీపంలోని సుల్‌హాలీ రైల్వేస్టేషన్ వద్ద శనివారం మధ్యాహ్నం గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. దీంతో ఆ రూట్‌లో రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. అప్రమత్తమైన రైల్వేశాఖ హుటాహుటిన పునరుద్ధరణ పనులు చేపడుతోంది. ప్రయాణికుల సౌకర్యార్థం పలు రైళ్లను దారి మళ్లించగా.. తాండూరు, సేడం, మల్ఖేడ్, చిత్తాపూర్ వరకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం నాందేడ్-బెంగళూర్ రైలు, రాయలసీమ ఎక్స్‌ప్రెస్ వికారాబాద్ నుంచి సికింద్రాబాద్, రాయచూర్ మీదుగా దారి మళ్లించారు. ముంబై రూట్‌లో ప్రయాణించే కోణార్క్ ఎక్స్‌ప్రెస్, ఎల్‌టీటీ(ముంబాయి), శతాబ్ది, రాజ్‌కోట్, హుస్సేన్‌సాగర్(ముంబై), హుబ్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లను వికారాబాద్ నుంచి జహీరాబాద్, బీదర్, ఖానాపూర్ జంక్షన్ మీదుగా కల్బుర్గికి దారి మళ్లించినట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. ఆర్టీసీ అధికారులు వికారాబాద్ నుంచి తాండూరు వరకు ప్రత్యేకంగా 30 బస్సు సర్వీసులు ఏర్పాటు చేసి ప్రయాణికులను తరలించారు. కాగా పండగకు ఊరెళ్తున్న ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలువురు వికారాబాద్ స్టేషన్‌లో ఉండిపోయారు.

ముగ్గుల ఫొటోలు తీస్తూ జారి పడిన బాలిక..

కుషాయిగూడ: అపార్టుమెంట్ ముంగిట వేసిన ముగ్గుల ఫొటోలు తీస్తుండగా జారీ పడి ఓ బాలిక మృతిచెందిన సంఘటన శనివారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కాప్రా, సాధనవిహార్ కాలనీ, ఆవాస్ అపార్టుమెంట్లో ఉంటున్న పోతిశెట్టి కిన్నెర (14) 9వ తరగతి చదువుతోంది. అపార్ట్‌మెంట్ ఆవరణలో వేసిన ముగ్గులను ఐదో అంతస్తునుంచి సెల్ ఫోన్‌లో ఫొటో తీస్తూ ప్రమాదవశాత్తు జారి కింద పడటంతో మృతిచెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.